క్లుప్తంగా



విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల విస్తృత స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ హాజరయ్యారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన సభలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ గుల్లేపల్లి రూరల్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లునాయుడుపాలెం,మొగలిపురం గ్రామాలకు 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

శంభో శంకర



సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. హరనామస్మరణ మార్మోగింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట వేస్తున్న సర్పంచ్ నాగమణి

పరవాడ: పెదముషిడివాడ గ్రామంలో దుర్గాదేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని సర్పంచ్ పల్లా నాగమణి చెప్పారు. శరన్నరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం ఆమె పందిరిరాట వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ కలవలపల్లి సత్యనారాయణ, బొండా అరుణ, బలిరెడ్డి అప్పారావు, బొండా అచ్చిబాబు, నాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సాగుపై విద్యార్థులకు అవగాహన



విత్తనాలు నాటుతున్న విద్యార్థినులు

సింహాచలం: పురుషోత్తపురంలోని హై ఫీల్డ్స్ స్కూల్‌లో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.ఆకుకూరలు, కూరగాయల విత్తనాలను విద్యార్థులతో వేయించి వాటి ప్రాధాన్యతను వివరించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలని సూచించారు. అలాగే ధ్యానం, యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మధనమాల, పీఈటీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గుల్లేపల్లి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన

సబ్బవరం: మండలంలోని సబ్బవరం–గుల్లేపల్లి రోడ్డు విస్తరణ పనులకు రాష్ట్ర ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంగళవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరంలోని పాతరోడ్డు వద్ద రూ.5.71 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న ఈ రోడ్డు విస్తరణ,అభివృద్ధి పనులకు ఉదయం 8:30 గంటలకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో చెంతకే వైద్యం

- ఎంపీపీ బోకం సూర్యకుమారి
- బంగారమ్మపాలెంలో వైద్య శిబిరం
- 600 మందికి పరీక్షలు
- ఉచితంగా మందుల అందజేత
- పలువురిని మెరుగైన వైద్యం కోసం సిఫార్సు



జగన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాల స్టాల్

సబ్బవరం: జగన్న ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకే వైద్య సేవలు చేరువయ్యాయని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని బంగారమ్మపాలెం సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం స్థానిక మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పేదల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. డబ్బులేని కారణంగా ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదని ఇంటింటికీ వైద్య సిబ్బందిని పంపించి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఎంపీడీవో రమేష్ నాయుడు మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని బంగారమ్మపాలెం,రాయపుర అగ్రహారం, ఎ. శిరసపల్లి గ్రామాల నుంచి 600 మంది వరకూ వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు తెలిపారు. నాలుగు బ్లాక్‌లుగా విభజించి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వారికి అవసరమైన అన్ని రకాల మందులు ఉచితంగా అందించామన్నారు. పలువురిని మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేశారు. సర్పంచ్‌లు దాడి లావణ్య,పిల్లల అప్పలనాయుడు, తహసీల్దార్ బి. సత్యనారాయణ,ఈవోఆర్డీ మహేష్, మాజీ సర్పంచ్ రాపేటి రాము, ఉప సర్పంచ్ అంగటి సూరిబాబు, కార్యదర్శి మౌనిక పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత చేగువీరా



'చే' చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: ఎక్కడ అన్యాయం జరిగినా బాధితుల పక్షాన నిలిచిన మహోన్నతుడు చేగువీరా అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. చేగువీరా వర్ధంతి పురస్కరించుకుని సోమవారం వాడచీపురుపల్లిలో ఆయన చిత్రపటానికి సీఐటీయూ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ బొలీవియా విముక్తి పోరాటం చేస్తున్న చేగువీరా సీఐఏకి పట్టుబడడంతో 1967 అక్టోబరు 9న కాల్చి చంపారన్నారు. యువతకు స్ఫూర్తిగా నిలిచిన ఆయన అడుగుజాడల్లో నడుద్దామని యువతకు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధి పి.మాణిక్యం, సీఐటీయూ నాయకులు ఆదిలక్ష్మి, రత్నం, నూకరత్నం, లక్ష్మి, సత్యవతి, నాగమణి పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్వో నాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం అనకాపల్లికి చెందిన మళ్ల రామకోటేశ్వరరావు లక్షా 116 రూపాయిల విరాళం ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు పీఆర్వో నాయుడు అన్నప్రసాద బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు.



దాతలకు ప్రసాదం అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం నగరానికి చెందిన బి.అశ్విని, సురేందర్‌రెడ్డి దంపతులు రూ. లక్ష విరాళం ఇన్‌చార్జి ఏఈవో పాలూరి నరసింగరావుకు అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు.

అందరి సహకారంతో కాలుష్య నియంత్రణ



సైకిల్‌పై కార్యాలయానికి చేరుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: కాలుష్య నిర్మూలనకు నగర పౌరులందరూ సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. నగర కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీ కార్యాలయానికి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. నగరంలో శబ్ద, వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా, కాలుష్య రహిత వాహనాలు వినియోగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో 'ఉక్కు' మహిళల ప్రతిభ



షీల్డులు అందుకుంటున్న అంజలి, రోజాకుమారి, సంధ్యారాణి, సంధ్యాసాహు

ఉక్కునగరం: విశాఖ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఉక్కునగరం మహిళలు యు.అంజలి, పి.రోజాకుమారి, పి.సంధ్యారాణి, సంధ్యా సాహు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీస్ బ్యారెక్స్‌లో ఆదివారం పలు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉక్కునగరానికి చెందిన యు.అంజలి 55+ కేటగిరీలో డిస్కస్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో ప్రథమ బహుమతులు గెలుపొందారు. 50+ కేటగిరీలో పి.రోజా కుమారి 5 కిలో మీటర్ల నడక పోటీలో, షాట్‌పుట్ పోటీల్లో ప్రథమ బహుమతులు కైవసం చేసుకున్నారు. 50+ కేటగిరీ పోటీల్లో పి.సంధ్యారాణి 5 కిలోమీటర్ల నడక పోటీల్లో ప్రథమ బహుమతి గెలుపొందారు. 40+ కేటగిరీ పోటీల్లో సంధ్యా సాహు డిస్కస్ త్రో, షాట్‌పుట్‌లో ప్రథమ బహుమతులు కైవసం చేసుకున్నారు. వీరు నలుగురు డిసెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి టి.వెంకటాద్రి తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో గాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం దుర్గానగర్‌లో నివసిస్తున్న బి.మహంతి దుస్తుల వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తన బావమరిది బైకుపై కంచరపాలెం నుంచి పూర్ణామార్కెట్‌కు వెళ్తున్న క్రమంలో జ్ఞానాపురం వద్దకు వచ్చేసరికి గాజువాక నుంచి అటుగా వస్తున్న ఏపీ08ఎఫ్ 6126 నంబర్ గల కారు వేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. వెనక కూర్చున్న మహంతి ఒక్కసారిగా కింద పడిపోగా.. అతడి కుడి కాలుకు ఫ్రాక్చర్ అయ్యింది. క్షతగాత్రుడిని చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. మహంతి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవడం తప్పనిసరి



శిక్షణకు హాజరైన ఎన్‌టీపీసీ అధికారులతో ఐఐఎం అధికారులు

ఏయూ క్యాంపస్: సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎన్‌టీపీసీ సింహాద్రి హెచ్‌వోపీ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్‌లో ఎన్‌టీపీసీ అధికారులకు నిర్వహిస్తున్న లీడర్‌షిప్ కోర్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిలో పరిణితి సంస్థ అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు వ్యక్తి ఉన్నతికి ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. ఐఐఎం విశాఖపట్నం ఇటువంటి కార్యక్రమాలను విస్తృతగా నిర్వహించాలన్నా రు. నిర్వహణ సామర్థ్యాలను పెంపొందించుకునే విధంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎన్‌టీపీసీ హెచ్‌ఆర్ విభాగాధిపతి రుమా డి.శర్మ మాట్లాడుతూ ఇటువంటి ప్రత్యేక కోర్సులు సంస్థ లో పనిచేసే ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని పెంపొంది స్తాయన్నారు. ఐఐఎం పరిపాలన విభాగం డీన్ ఆచార్య ఎం.వి.అనూరాధ మాట్లాడుతూ భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దడానికి, సంస్థ ప్రగతికి దోహదపడే వ్యక్తులుగా తమ సిబ్బందిని మలచడా నికి ఇటువంటి ప్రత్యేక కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్, ప్రోగ్రాం డైరెక్టర్ ఆచార్య విశాల్ సింఘ్ పట్యాల్, తదిరతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంతోనే పర్యావరణ పరిరక్షణ



సదస్సులో పాల్గొన్న రెక్టార్ ఆచార్య కె.సమత

ఏయూ క్యాంపస్: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను నిషేధించడం తప్పనిసరని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యంలో మైక్రో ప్లాస్టిక్స్ ఇన్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ అంశంపై నిర్వహించిన మూడు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా సముద్ర జీవులకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. యూరోపియన్ కమిషన్ అందించిన ప్రాజెక్టులో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 25 మంది పరిశోధకులు, అధ్యాపకులు, సహాయ ఆచార్యులు, మత్స్యశాఖ, జీవీఎంసీ అధికారులు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి, విభాగ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగంలో నవంబరు 2, 3, 4 తేదీల్లో ద్రవ స్ఫటికాలపై నిర్వహించే మూడు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల శాస్త్రవేత్తలు, పరిశోధకులు 250 మందికిపైగా హాజరై తమ పరిశోధన పత్రాలను సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య కె.బసవయ్య, కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ నాంచార రావు, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, ఆచార్య ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను సరిచేస్తాం

సాక్షి ఎఫెక్ట్..



గొల్లగుంటలో పారిశుధ్య పరిస్థితులను పరిశీలిస్తున్న అధికారులు

పరవాడ: మండలంలోని రావాడ శివారు గొల్లగుంట గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను సరిచేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. కాలువలు నిర్మించరూ శీర్షికన ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈవోఆర్డీ రమేష్ నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షన్ముఖ, సర్పంచ్ ఎం.ఎస్.నాయుడు సోమవారం గ్రామంలో పర్యటించారు. డ్రైనేజీ వ్యవస్థలో లోటుపాట్లను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి బోరు వద్ద మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతున్నట్టు గుర్తించారు. మురుగునీటిని రోడ్డు అవతల వైపు ఉన్న కాలువకు మళ్లించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. బోరు వద్ద నీరు నిలిచిపోకుండా ఉండేందుకు నూతన కాలువ నిర్మాణానికి నిధుల కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షన్ముఖ చెప్పారు. సమస్య త్వరలో పరిష్కారం అవుతుందన్నారు. గ్రామంలో పలు చోట్ల అస్తవ్యస్తంగా ఉన్న మురుగునీటి వ్యవస్థను సరిచేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అదేవిధంగా మురుగు కాలువల్లో క్లోరినేషన్, అపరిశుభ్ర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారీ చేసి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కార్యదర్శి అనురాధను ఆదేశించామని ఈవోఆర్డీ రమేష్‌నాయుడు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి మారథాన్‌కు ప్రతిభా విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఏటీఎల్ సిబ్బంది

సబ్బవరం: జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల జాతీయ స్థాయి మారథాన్‌కు సబ్బవరం ప్రతిభా విద్యాలయం విద్యార్థులు ఎంపికయ్యారని ఏటీఎల్ ఎంవోసీలు వి. రాజశేఖర్,ఎస్. అనుపమరాణి తెలిపారు. స్థానిక ప్రతిభా విద్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ప్రయోగాల్లో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అటల్ మారథాన్ దేశంలో యువ ఆవిష్కర్తలకు జాతీయ స్థాయి ఇన్నోవేషన్ ఛాలెంజ్ అని తెలియజేశారు. ఈ మారథాన్‌లో జాతీయ స్థాయిలో 12 వేల టీంలు పాల్గొనగా వాటిలో 400 టీంలను ఎంపిక చేశారన్నారు. వీటిలో అనకాపల్లి జిల్లా నుంచి ప్రతిభా విద్యాలయం విద్యార్థులు మాత్రమే ఎంపికైనట్లు తెలిపారు. 2023–24 సంవత్సరానికి గాను ప్రతిభా విద్యాలయం టెస్టింగ్ ట్రిక్స్ టీమ్ విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. ఈ టీంలో కొప్పల సృజన, రొంగలి లిఖిత, చలుమూరి ఎర్నికుమారి ఉన్నారు. అటల్ టింకర్ ప్రెన్యూర్ 2023 జాతీయ స్థాయి బూట్ క్యాప్ ఎయిమ్ ద్వారా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ బూట్ క్యాప్‌లో ఎంపికైన టాప్ 100 టీమ్స్‌కు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి ఇంటర్న్‌షిప్, ఫండింగ్ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రతిభా విద్యాలయం కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ,ప్రిన్సిపాల్ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో సాధన చేస్తే రాణింపు



కోచ్ నాగార్జునను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ తదితరులు

సబ్బవరం: నిర్దిష్ట లక్ష్యం ఏర్పరచుకుని తగిన సాధన చేస్తే క్రీడా రంగంలో రాణించవచ్చని ఆర్మీ ఇంటర్నేషనల్ అథ్లెటిక్ కోచ్ పల్ల నాగార్జున అన్నారు. సబ్బవరంలోని రేంజర్స్ డిఫెన్స్ అకాడమీలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అకాడమీలో శిక్షణ పొందుతూ జిల్లా ,రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో విజేతలగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. క్రీడల్లో రాణించడానికి ఎలా సాధన చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పోతల సత్యనారాయణ, డైరెక్టర్ మీనాక్షి,లక్ష్మి,పల్ల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్ మేళా విజయవంతం

499 మంది విద్యార్థుల ఎంపిక



మాట్లాడుతున్న ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు



మేళాకు హాజరైన విద్యార్థులు

పెదగంట్యాడ: ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు అప్రెంటిస్‌షిప్‌ను కూడా విజయవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీలో సోమవారం నిర్వహించిన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళాను ఆయన ప్రారంభించారు. అప్రెంటిస్‌షిప్ పూర్తయిన వారికి పరిశ్రమల్లో ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేళాలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఎస్ఆర్ఎంటీ, హ్యుండాయ్ మోటార్స్, దేవి ఇంజినీరింగ్స్, ఎండీ ఎలక్ట్రికల్స్, లోహిత ట్రాన్స్‌ఫార్మర్స్ తదితర కంపెనీలు పాల్గొన్నాయి.

ఈ మేళాకు మొత్తం 650 మంది విద్యార్థులు హాజరు కాగా 499 మంది విద్యార్థులను వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఎంపిక చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. మొత్తం 6 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో వి.సత్యనారాయణ, కుమారి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

970వ రోజుకు ఉక్కు పరిరక్షణ ఉద్యమం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కార్మికులు పట్టు వదలక చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 970వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రప్రభుత్వం అమ్ముకుంటూపోతే దేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థ మిగలదన్నారు. ఇప్పటికే దేశంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాక, నిరుద్యోగ సమస్యతో యువత వ్యసనాలకు బానిసలవుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.